# ఆనందు ఆత్మహత్య

-ఎవిజి కృష్ణ

ఆనందు ఆత్మహత్య చేసుకోబోతున్నాడని విని అదిరి పడ్డాను.

"పద, పద" అన్నాడు వార్త మోసికొచ్చిన అప్పారావు. 'ఎక్కడికి?' అన్నాను కీచుగొంతుతో - ముత్యాలముగ్గులో ముక్కామల లాగ.

"బీచికి" అంటూ నన్ను ఈడ్చికెళ్ళాడు.

సాయంత్రం నాలుగు గంటలకి సముద్రంలో దూకుతానని కబురు పంపించాట్ట ఆనందు.

అంటే దూకేసరికి జనం ఎక్కువగా ఉండకూడదు. కాని శవం ఒడ్డుకి కొట్టుకొచ్చేసరికి మాత్రం బీచినుండి పోవాలి! అదీ కీర్తిశేషుడు. ఐ మీన్, కీర్తికాముకుడు ఆనందు అయిడియా!

"చావు తెలివి!" అనుకున్నాను.

మేం మాట్లాడుకుంటూ బీచిచేరేసరికి నాలుగుదాటి అరగంటయింది.

ఆనందం అప్పుడులేదు! కొంపదీసి నాలుగంటే సరి



గ్గా నాలుగ్గంటలకే దూకేసాడేమో! గోదావరి ఎక్సుప్రెస్ డిపార్చురు టైము కన్నా వీడి 'డిపార్చరు' టైమే కరక్టుగా ఉన్నట్టుంది.

నేనూ అప్పారావు మరో నలుగురూ కలిసి నాలుగు దిక్కులా ఆత్రుతగా చూస్తున్నాం. అదోవిధమైన ఆత్రుత అది!

ఫలానారైలుకి వస్తానన్నవాడు ఆరైలొచ్చాక దాంట్లోంచి దిక్కపోతే కలిగే ఆత్రుతలాంటిదది.

చచ్చిపోతానన్న పెద్దమనిషి సముద్రంలోనూ లేక ఒడ్డునా లేకపోతే ఒడ్డునపడ్డ చేపల్లా గిల గిలా కొట్టుకుంటున్నాం.

అప్పుడు మాక్కనిపించింది సముద్రంలోంచి ఒడ్డుకు కొట్టుకువస్తున్న 'ఆనందుశవం'

అదుగో శవం! అన్నాడొకడు.

'అదుగోచొక్కా'! అన్నాడింకొకడు.

నాగుండె కొట్టుకోడం మానేసింది. దుఃఖం వస్తూంది. కన్నీళ్ళు వస్తున్నాయి. అవి జారి సముద్రంలోపడితే సముద్రంలోని జలం ఒక క్యూటిక్ సెంటిమీటరు ఎక్కువవుతుంది కాబోలు!

పుల్‌హేండ్సు చారలషర్టు తొడుక్కున్న శవం నాలుగు సార్లు అటూ ఇటూ ఊగేసరికి మాకు తెలిసిపోయింది. అది శవంకాదు ఒట్టిచొక్కాయే. అని. అయితే శవం కాసేపట్లో వేరేగా ఒడ్డుకి కొట్టుకు వస్తుందన్నమాట, భయంవేసి దూరంగా కూర్చున్నాం.

ఏ సంగతీ తేలలేదు. శవమూ తేలలేదు. ఎంతసేపో శవజాగరణ అనుకుని అక్కడ 'మా' బెస్తవాడికీ సంగతి చెప్పి "మద్దినాల మా ఫ్రండు వొచ్చాడా?" అని అడిగాం.

మేం రోజూ కూర్చునే స్పాటు అదే! మా బెస్తవాడికి తెలుసు!



# బాధ

"నేను వెళ్తున్నా! నువ్వు దింపడానకి వచ్చి బాధ పడకు!" అన్నాడు వంశీ.

"అది బాధేలా అవుతుంది? సంతోషకరమైన వార్త అయితేను" అన్నాడు సురేష్.


-పి.వి.మురళీకృష్ణ
ఇ.నం.16-11-418/3/2,
ఆంధ్రా లా టైమ్సు దగ్గర
దిల్‌సుఖ్‌నగర్
హైదరాబాద్ - 500 036.


"వచ్చాడుబాబూ, చారలచొక్కా తొడుక్కుని చాలాసేపు మొగం చేతుల్తో కప్పుకుని కూకున్నాడు. తరవాతెక్కడికెళ్ళాడో తెల్దు."

"అతని స్నేహితులు ఎవరైనా వచ్చారా?"

"లేదు బాబూ. లాట్రీ టిక్కట్టబ్బాయి మాత్రం అలవాటుగా వచ్చి నాలుగుటిక్కట్టు అనందుబాబుకిచ్చాడు. మనబాబు అటేసి విసిరికొట్టి...

'ఛీ' ఈ వెధవ టిక్కట్లు కొనీ కొనీ మా నాన్న పంపిన డబ్బులో నెలకి రెండొందలు తగలేస్తున్నాను. మరి కొనను" అన్నాడండి.

అప్పుడాఅబ్బాయి...

"నువ్వో నాలుగు కొను తాతా, లక్షాధి కారివైపోతావ్!" అన్నాడండి."

"మరికొన్నారా?"

బెస్త నవ్వి 'నాకేటీమీద నమ్మకం లేదు బాబూ! నా రెక్కల కట్టంమీద నాకు నమ్మకం. 'ఆ మాటే, ఆడికి చెప్పాను.

ఆడుకూడా 'నాకూ అదే నమ్మకం అంటూ రెక్కలాడించు కుంటూ వెళ్ళి పోయాడు.' 'లాట్రీ టిక్కట్లు' అని అరుచుకుంటూ."

"మరి మా ఫ్రెండు?"

"ఆయన చొక్కావిప్పేసి దాంతోనే విసురుకుంటూ కూచున్నాడు. తర్వాత ఎటెల్లాడో చూళ్ళేదు." అన్నాడు బెస్త చుట్ట వెలిగించి.

మాకూ విసుగొచ్చింది. ఇంత సముద్రపుటొడ్డుండగా ఆనంద్‌గాడి శవం ఇటేపేకొట్టుకొస్తుందని నమ్మకమేమిటి. ఇంటికిపోయి మళ్ళీ స్నానం అదీ చెయ్యాలి.

జనం మెల్లి మెల్లిగా బీచ్‌కి వస్తున్నారు. మేం జిడ్డు మొహాలతో ఉన్నాం.

తెలిసిన ఆడపిల్లలు ఇక్కడ కనిపిస్తే "వీళ్ళ అసలు రూపాలు ఇలా 'బాబూ మోహన్'లా ఉంటాయా." అని రేపట్నించి మా మొహాలు కూడా చూడరు అనుకుంటూ వెళ్ళిపోయాం.

నెల్లాళ్ళు గడిచాయి. అప్పుడప్పుడూ ఆనందు గుర్తుకొస్తున్నాడు ముఖ్యంగా అప్పారావుకి. ఎందుకంటే ఆనందు అప్పారావుకి రెండొందలు బాకీ.

"నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేనురా, అప్పారావూ" అంటే...


"పోనీ మళ్ళీ జన్మలో తీరుద్దువు గానీలే" అన్నాట్ట అప్పారావు. అప్పారావు అందుకు ఏడుస్తున్నాడిప్పుడు.

రెండునెల్ల తరవాత నేను బీచిరోడ్డుమీద నడుస్తూంటే ఒక లాటరీకుర్రాడు దూరంగా కనబడ్డాడు. వాడు దగ్గరకు రాగానే ఆనందు గురించి అడుగుదామనుకున్నాను, ఆ లాటరీవాడు, ఈ లాటరీవాడు ఒక్కడే అయితే.

వాడు దగ్గరకు రాగానే నేను దూరంగావెళ్ళిపోయాను. కారణం అతను లాటరీకుర్రాడే గాని పేరు ఆనందు.

వాడు నన్ను చూసి నవ్వుతూ "ఇంతమంది జనం ఉండగా భయమెందుకురా? నేను దయ్యాన్నికాదు. నేను చచ్చిపోలేదు...." అన్నాడు.

నాకు మతిపోయింది. "మరి ఆ రోజున నీ కబురూ... సముద్రంలో షర్టూ... ఏమిటీ ఇదంతా...? మేం ఆ రోజున రాత్రి పన్నెండుదాక బీచిలో కూర్చునాం దెయ్యాల్లాగా." అన్నాను.




కెంచు చిన్నన్న, కార్టూనిస్ట్, పోస్ట్ః చిన్నమెట్‌పల్లి, మంః కొరుట్ల, జిల్లా-కరీంనగర్-505 453.

# కరిష్మా క్రేజ్



కరిష్మాకి సినీతారగా బోల్డంత గుర్తింపు లేదని ఎవరైనా అనగలరా? అనలేరు. ఎందుకంటే ఆమెకి విదేశాల్లో సైతం వీరాభిమానులున్నారు. ఇటీవల అలాగే ఆమె వీరాభిమాని పెళ్ళినిమిత్తం స్వయంగా డాన్సకూడా చేసొచ్చింది కరిష్మా. గల్ఫ్‌లోని ఓ సుల్తాన్‌గారి ముద్దుల కుమార్తె. పెళ్ళి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరిష్మా నాట్యం ప్రత్యేక ఆకర్షణ. అంతేకాదు, కరిష్మాతో పాటు మరో డాన్సర్ కూడా ఉంది. ఆమె ఎవరో కాదు, మైఖేల్ జాక్సన్ చెల్లెలు జానెట్ జాక్సన్! జానెట్ జాక్సెన్‌తో కలిసి డాన్స్ చేసిన కరిష్మా అంటే క్రేజ్ ఉందంటారు కదా!

-మౌర్య

వాడు పెద్దగా నవ్వి, "మీరెంతదాకా కూచున్నారో నాకు తెలుసు. ఐస్‌పార్లర్‌లో కూచుని చూశాను. మీరు ఆరు కాకుండానే వెళ్ళిపోయారు. స్నేహాలు ఇలాగే ఉంటాయి కదా అనుకున్నాను. అంతకు ముందు లాట్రీలబ్బాయి నాకు టిక్కట్టు ఇవ్వడం నేనొద్దంటే ఆ బెస్తవాడికివ్వడం, వాడు, 'నాకు లాట్రీలమీద నమ్మకం లేదు. నాకు రెక్కల కష్టం మీదే నమ్మకం' అనడం, ఆ లాట్రీలబ్బాయి కూడా అదే మాట అనడంతో నాకు జ్ఞానోదయం అయింది."

"బాగుంది, వ్యాసుడుకి బోయడు జ్ఞానోపదేశం చేసినట్టు."

"నీ మొహం! వ్యాసుడు కాదు. వ్యాసుడు రాసిన భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఏం చెప్పాడు? మనిషి మలిన వస్త్రాన్ని విడిచి మంచిషర్టు తొడిగినట్టే ఆత్మ ఒక శరీరం విడిచి మరో శరీరం లోకి పోతుందని కదా! అలాగే నేను నా చారల చొక్కా విడిచి కొత్త షర్టులోకి మారాను. లాటరీ టిక్కట్లు, కొనేషర్టు సముద్రంలోకి పోయింది. లాట్రీ టిక్కట్లు అమ్మే షర్టు నన్ను ఒడ్డుకి చేరుస్తోంది"

"గొప్పగా మారేవురా" అన్నాను.

"మారొద్దూ మరి!' చదువులేని ఆ బెస్తవాడికి, లాట్రీవాడికి ఉన్న జ్ఞానం నాకు లేక పోయింది. రెక్కల కష్టం మీదే నమ్మకమంట ఆ ఇద్దరికీ! లాట్రీకుర్రాడికి టిక్కట్లు అమ్మకం మీదే కన్ను, కానీ లాట్రీలో ప్రైజువస్తే బాగుణ్ణనుకుకోడు. బ్రాందీ షాపువాడు బ్రాందీ అమ్ముతాడే కాని తాగడు. ఇవన్నీ చూసి నేను లాట్రీ టిక్కట్లు కొనడం మానేసి అమ్మడం మొదలెట్టాను. నెలకి రెండువందలకు పైగా వస్తుంది."

"మరి చదువు మానేశావా?" అన్నాను.

"నువ్వు మానేశావా?" వాడి ఎదురుప్రశ్న.

"లేదు పగలంతా చదువుతాను."

"నే అంతే. పగలంతా చదువుతాను. సాయంత్రం బీచికొచ్చి రెండుగంటలు టిక్కట్లు అమ్ముతుంటాను. నా కాళ్ళమీద నిలబడుతున్నాను."

నేను హఠాత్తుగా వాడి కళ్ళవైపు చూశాను. వాడు సాక్షాత్తూ వాడికాళ్ళమీదే నిలబడ్డాడు. పైగా వాడి పాదాలు వెనక్కి తిరిగిలేవు.

నాకేమీ తోచక "నువ్వు లాట్రీ టిక్కట్లు కొనకపోవడమే కాకుండా అమ్మడం కూడా ప్రారంభించి మీ ఫ్రెండు అదే ఆ లాట్రీలబ్బాయి నోట్ల రెండు విధాల మట్టి కొట్టావు" అన్నాను.

"మరి - మా నాన్న నోట్లో మట్టి కొట్టమంటావా? విను, నేను మా నాన్న నోట్లోనూ మా ఫ్రెండు నోట్లోనూ పంచదార కొడుతున్నాను. మా ఫ్రెండు 'లాట్రీ సెంటర్' పెట్టాడు. నేను మరోనలుగురూ అక్కడికెళ్ళి టిక్కట్లు తెచ్చుకుని అమ్ముకుంటాం. నాకిది చాలా బాగుంది. సాయంత్రం పూట నా ఈవీనింగు వాకూ, బీచ్‌షికారూ, నా సంపాదనా అన్నీ ఒకేసారి అయిపోతున్నాయి. అప్పారావు అప్పు తీర్చేస్తాను." అన్నాడు.

నాకేమిటో చికాగ్గా ఉంది. కొంపతీసి ఇలా చదువుకుంటూనే ఆడుతూ పాడుతూ, లాట్రీ టిక్కట్లు అమ్మి నెలకి వెయ్యిరూపాయలు ఆర్జించి లక్షాధికారి అయిపోతాడేమో అనుకుని ఆఖరి అస్త్రంగా.


"నువ్వు చచ్చిపోతావన్న రోజున మేం బీచ్‌లో రాత్రి పన్నెండుదాక కూచున్నాం. నువ్వు ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి నమ్మించి మోసం చేశావు" అన్నాను.

"చెప్పేగా, మీరు పన్నెండుదాకా లేరు. ఆరుకాకుండానే తుర్రుమన్నారు. స్నేహాలు ఇలాగే ఉంటాయికదా అనుకున్నాను. ఇక నమ్మించడం, ఆత్మహత్య అంటావా, నేనీ లాటరీ వ్యాపారం నా పొట్టకోసం చేస్తున్నాను. లాటరీటిక్కట్లు కొనడం వ్యసనం నుంచి నన్ను నేను తప్పించుకోడానికే ఈ వ్యాపారం చేస్తున్నాను. అదికూడా నాకేమాత్రం ఇష్టం లేకుండానే చేస్తున్నాను. అంటే ఆత్మను చంపుకునే చేస్తున్నాను. వస్తా నా బేరాలు పోతాయ్!" అని వెళ్ళి పోయాడు.

మొత్తంమీద ఆనందు ఆత్మహత్య చేసుకున్నట్టే కదా అని నేను సంతృప్తిగా ఐస్‌పార్లర్ వైపు నడిచాను.


వి.వి.జి. కృష్ణ
ఎఫ్. బ్లాక్ - ఎ, రామ్‌లక్ష్మీ ఎస్టేట్స్,
పెద వాల్తేర్
విశాఖపట్టణం - 530 017.


★




బి.సుధీర్, కార్టూనిస్ట్, బి/39/15, ల్యాబ్ క్వార్టర్స్, కంచన్‌బాగ్, హైదరాబాద్-500 258.